# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 314 | శనివారం 6 జూలై 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




11 మంది ఇంజినీర్లపై

## సస్పెన్షన్ వేటు

- బిహార్‌లోని వంతెనల పరిస్థితిపై దేశవ్యాప్తంగా ఆందోళన
- మరోవైపు ఈ వంతెనల కూలిపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వంపై స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రెండు వారాల్లో 12 వంతెనలు కూలిపోవడంతో ప్రజల ఆగ్రహం

విభజన అంశాలు ఇప్పటికైనా

# కొలిక్కి వచ్చేనా?

- నేడు ఇద్దరు సీఎంల భేటీ.. చర్చించే అంశాలు ఇవే..!
- ప్రధానంగా షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజనపై చర్చించే అవకాశాలు
- సీఎంల భేటీకి ప్రగతి భవన్‌లో అధికారులు ఏర్పాట్లు
- విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై వీరిద్దరూ భేటీ కావటం ఇదే తొలిసారి
- విభజనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి



హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు రేవంత్‌రెడ్డి రేపు(శనివారం) ప్రజా భవన్ వేదికగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు కూడా సమావేశం కాబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇద్దరు సీఎంల భేటీలో ఏ అంశాలపై చర్చ సాగనుందనేది ఆసక్తికరంగా మారింది. సీఎంల భేటీకి ప్రగతి భవన్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై వీరిద్దరూ భేటీ కావటం ఇదే తొలిసారి. ప్రధానంగా షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజనపై - మిగతా3లో



## నీట్ పరీక్ష రద్దు సరికాదు

- సుప్రీం కోర్టులో కేంద్రం అఫిడవిట్
- భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు సాక్ష్యాలు లేవు
- అలాంటప్పుడు మొత్తం పరీక్షను రద్దు చేయడం సబబు కాదు
- పారదర్శక విధానంలోపోటీ పరీక్షల నిర్వహణకు కట్టుబడి ఉన్నాం
- రద్దు చేయడం వల్ల పరీక్ష రాసిన లక్షలాది మంది నిజాయతీపరులకు అన్యాయం జరుగుతుంది

# మీ సేవలో అంతా దోపిడీయే

- లంచం ఇస్తే చాలు కులం మారిపోతుంది
- ముడుపులు చెల్లిస్తే చాలు ఆదాయం తగ్గించి సర్టిఫికెట్లు ఇచ్చేస్తారు
- సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువైపోయి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు
- రాంగ్ రూట్ లో సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తూ భారీ స్కామ్
- ఎమ్మార్వో లాగిన్ ఐడీ నుంచి ఆయన సంతకాల వరకూ ఈ టెక్నాలజీని విచ్చలవిడిగా వాడుకున్నారు.

హైదరాబాద్

అక్కడ ఎడాపెడా కులం, ఆదాయ సర్టిఫికెట్లు బహిరంగంగా దొరుకుతాయి. లంచం ఇస్తే చాలు కులం మారిపోతుంది. ముడుపులు చెల్లిస్తే చాలు ఆదాయం తగ్గించి సర్టిఫికెట్లు ఇచ్చేస్తారు. సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువైపోయి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల ఎమ్మార్వో ఆఫీసు అక్రమార్కులకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. రాంగ్ రూట్ లో సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తూ భారీ స్కామ్ కు పాల్పడ్డారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎస్ టీ పీ ఆపరేటర్-2 పేరుతో లాగిన్ అయి మూడు వేర్వేరు ఫోన్ నెంబర్లతో భారీ ఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డారు. ఎమ్మార్వో లాగిన్ ఐడీ నుంచి ఆయన సంతకాల వరకూ ఈ టెక్నాలజీని విచ్చలవిడిగా వాడుకున్నారు. ఇప్పటిదాకా సుమారు వెయ్యికి పైగా స్థానికేతరులకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ చేశారని సమాచారం. . ఫీజ్ రియంబర్స్మెంట్ , స్కాలర్ షిప్, ప్రభుత్వ - మిగతా3లో




## నిరుద్యోగుల ఆందోళన

- టీజీపీఎస్సీ వద్ద ఉద్రిక్తత
- టీజీపీఎస్సీ శాంతియుత ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపు
- ప్రధానంగా మూడు డిమాండ్లతో ముట్టడికి పిలుపు
- గ్రూప్ 2,3 పోస్టులు పెంచి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్
- డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేసి, అక్టోబర్‌లో 25,000 పోస్టులతో మెగా డీఎస్సీ పెట్టాలని డిమాండ్



## ప్రజల ఆగ్రహం తనను తాకింది

- ప్రధానిగా చివరి ప్రసంగం...
- రిషి సునాక్ భావోద్వేగం
- ప్రభుత్వం మారాలని ప్రజలు స్పష్టమైన సందేశమిచ్చారని వ్యాఖ్య
- ప్రజలకు క్షమాపణలు చెప్పిన రిషి
- ఓడిపోయినందుకు పార్టీ నేతలకూ క్షమాపణలు



హైకమాండ్ దగ్గర

# పలుకుబడి తగ్గిందా?

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం, ఆధిపత్య పోరు కనిపించకుండా భారీగా ఉందని కేబినెట్ విస్తరణ ఆగిపోవడం.. పీసీసీ చీఫ్ పదవి పై ఓ అంచనాకు రాలేకపోవడం వల్ల అర్థం చేసుకోవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అనుకున్నారు. ప్రాంతాలు, వర్గాలు సమీకరణాల్ని రెడీ చేసుకుని ఐదుగురి పేర్లతో హైకమాండ్ వద్దకు వెళ్లారు. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచారని అనుకున్నారు. అయితే రేవంత్ కు పోటీగా మరో ఇద్దరు సీనియర్ మంత్రులు.. కేబినెట్‌లో ఫలానా వాళ్లకు చోటు కల్పించాలం టూ.. చెరో జాబితా సమర్పించారని తెలుస్తోంది.



ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు

## మరోసారి తీవ్ర నిరాశ

- సీబీఐ కోర్టులో కవితకు చుక్కెదురు...
- జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు
- జులై 18 వరకు జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు
- ఈరోజుతో ముగిసిన కవిత జ్యుడీషియల్ రిమాండ్
- మద్యం కేసులో తీహార్ జైల్లో ఉన్న కవిత

# నీట్ పరీక్ష రద్దు సరికాదు



**ఢిల్లీ:** నీట్ యూజీ 2024 పరీక్షను పూర్తిగా రద్దు చేయడం వల్ల పరీక్ష రాసిన లక్షలాది మంది నిజాయతీపరులకు అన్యాయం జరుగుతుందని.. కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని సీబీఐని ఆదేశించినట్లు చెప్పింది. భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు సాక్ష్యాలు లేవని అలాంటప్పుడు మొత్తం పరీక్షను రద్దు చేయడం సబబు కాదని కోర్టుకు వివరించింది. ఈ మేరకు సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. పారదర్శక విధానంలోపోటీ పరీక్షల నిర్వహణకు కట్టుబడి ఉన్నామని ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసినట్లు కోర్టుకు తెలిపింది.

నీట్ రీషెడ్యూల్ విడుదల..

మే 5న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష లీకేజీ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఫలితాల్లో 60 మందికిపైగా ఫస్ట్ ర్యాంక్ రావడంతోఈ ఆరోపణలు బలపడ్డాయి. దీంతో చాలా మంది పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ వివాదంపై సుప్రీం కోర్టులో 26 పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం జులై 8న ఈ పిటిషన్లపై విచారణ జరపనుంది. అయితే పేపర్ లీక్ అయి వాయిదాపడ్డ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కొత్త తేదీలను శుక్రవారం ప్రకటించారు. నీట్ పీజీ పరీక్ష రద్దయిన దాదాపు 13 రోజుల తర్వాత నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పీజీ ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేశారు. ఆగస్టు 11 న నీట్ పీజీ నిర్వహిస్తారు. ఒకే రోజు రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గత ఏడు సంవత్సరాలుగా %చీజుజు-పా+% పరీక్షను జరుపుతోంది. నీట్ పరీక్ష పత్రం లీకేజ్ కారణంగా జూన్ 23న నీట్ పీజీ పరీక్షను రద్దు చేశారు. రద్దైన రెండు వారాల తరువాత కొత్త షెడ్యూల్‌ని ప్రకటించారు.

# మోదీ ప్రభుత్వం వచ్చే ఆగస్టులో కూలిపోవచ్చు..

## ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్ సంచలన వ్యాఖ్యలు..!

**మోదీ ప్రభుత్వం వచ్చే ఆగస్టులో కూలిపోవచ్చు..**
**ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్ సంచలన వ్యాఖ్యలు..!**



రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్రంలోని మోదీ సర్కారు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చాలా బలహీనంగా ఉన్నదని, ఆ ప్రభుత్వం ఏ క్షణమైనా కూలిపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. బలహీనమైన నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చే ఆగస్టు నెలలో కుప్పకూలవచ్చునని లాలూ యాదవ్ అనుమానం వ్యక్తంచేశారు. ఆగస్టులో మోదీ సర్కారు కూలిపోయే అవకాశం ఉన్నదని, కాబట్టి ఏ క్షణమైనా ఎన్నికలు రావచ్చని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత రెండు పర్యాయాల్లో బీజేపీకి ఫుల్ మెజారిటీ ఉండేది. ఈసారి బీజేపీకి సొంత మెజారిటీ దక్కలేదు. దాంతో మిత్రపక్షాలతో కలిసి మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బలహీన సంకీర్ణ సర్కారు ఏ క్షణమైనా కూలిపోతుందని లాలూ అంచనా వేశారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌లో డజనుకు పైగా వంతెనలు కుప్పకూలాయ్ : తేజస్వి యాదవ్**

బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని చెబుతున్నారని కానీ గత 20 రోజులుగా రాష్ట్రంలో డజనుకు పైగా వంతెనలు కుప్పకూలాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు. ఆర్జేడీ వ్యవస్థాపక దినం సందర్భంగా శుక్రవారం తేజస్వి మీడియాతో మాట్లాడారు. పలు రైలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. బిహార్‌లో విచ్చలవిడిగా నేరాలు పెచ్చుమీరాయని అన్నారు. పేపర్ లీక్ ఘటనలూ వెలుగుచూశాయని తేజస్వి యాదవ్ చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఏ ఒక్కరూ ఈ విషయాలపై మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ అంశాల గురించి మాట్లాడితే తేజస్వినే ఇదంతా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 17 ఏండ్లుగా గ్రామీణాభివృద్ధి శాఖ జేడీయూతోనే ఉందని, ఇప్పుడు కూలిన బ్రిడ్జిలను ఎవరు మంజూరు చేశారు, ఎవరు శంకుస్థాపన చేశారనే వివరాలను వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు. ఈ వివరాలు వెల్లడిస్తే ఎవరు అవినీతిపరులనేది తేటతెల్లమవుతుందని తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. ఇదంతా డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్వాకమే అని ఆయన మండిపడ్డారు.

## జైలు నుంచి గెలుపొంది.. ఎంపీగా ప్రమాణం చేసిన

# ఖలిస్థాన్ సానుభూతిపరుడు అమృత్‌పాల్



ఖలిస్థాన్ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్ లోక్‌సభ సభ్యుడిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి ఆయన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అస్సాంలోని ధిబ్రూగఢ్ జైలు నుంచి పెరోల్‌పై నేరుగా ఢిల్లీకి వెళ్లిన ఆయన 18వ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకరాం చేశారు. వారిస్ పంజాబ్ దే అధిపతి అయిన అమృత్‌పాల్ సింగ్ ఫిబ్రవరి 23న అరెస్టైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు ధిబ్రూగఢ్ జైలులో ఉన్నారు. అయితే, ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జైలు నుంచే పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు అమృత్‌పాల్‌కు అమృత్‌సర్ జిల్లా మెజిస్ట్రేట్ పెరోల్ జారీ చేసింది. ఇవాళ్టి నుంచి నాలుగు రోజులపాటు షరతులతో కూడిన పెరోల్ ఇచ్చింది. కారాగారం నుంచి ఢిల్లీకి వెళ్లి, తిరిగి కారాగారానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసేందుకు కూడా కోర్టు అనుమతించింది. ఢిల్లీని వదిలి మాత్రం ఎక్కడికీ వెళ్లకూడదని పేర్కొంది. ఢిల్లీలో ఉన్నప్పుడు అమృత్‌పాల్ గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ మీడియా ప్రకటనలు చేయకూడదని స్పష్టం చేసింది.

**ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన ఇంజినీర్ రషీద్**

మరోవైపు జమ్ముకశ్మీర్ టెర్రర్ ఫండింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం జైల్లో ఉన్న ఇంజినీర్ రషీద్ కూడా ఇవాళ లోక్‌సభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్ముకశ్మీర్ టెర్రర్ ఫండింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం జైల్లో ఉన్న ఆయన శుక్రవారం రెండు గంటల పెరోల్‌పై వచ్చి 18వ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రషీద్ భార్య, ముగ్గురు పిల్లలు, సోదరుడు సహా ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. రషీద్ ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాపై రెండు లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.

# ఆప్' పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సంజయ్ సింగ్



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ను ఆప్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారంనాడు నియమించింది. 'ఆప్' సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్నందున ఇప్పటికే పార్టీ బాధ్యతలను సంజయ్ సింగ్ చూసుకుంటున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ 2012లో ఏర్పాటు కాగా, కొద్దికాలానికే ఆ పార్టీలో చేరిన సంజయ్ సింగ్ వేగంగా పార్టీలో ఎదిగారు. ముఖ్య నేతల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. 2018లో తొలిసారిగా ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఏడాది తిరిగి రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా ఆప్ లెజిస్లేటివ్ ఎజెండాను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని వెళ్లడం, సంప్రదింపుల బాధ్యతను ఆయన చూసుకుంటున్నారు. తాజాగా ఆప్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా పార్లమెంటులో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసుకునే బాధ్యత ఆయనపై ఉంటుంది. పార్టీకి, ఇతర రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారులు, పార్లమెంటరీ కమిటీల మధ్య సమన్వయకర్తగా కూడా ఆయన వ్యవహరిస్తారు.

## ప్రజల ఆగ్రహం తనను తాకింది



ప్రధానిగా చివరి ప్రసంగంలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ భావోద్వేగానికి లోనయ్యారు. బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీంతో ఓటమికి ఆయన బాధ్యత వహించారు. పదవి నుంచి దిగిపోవడానికి ముందు ఆయన తన అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ ముందు నిలబడి ప్రధాని హోదాలో చివరి ప్రసంగం చేశారు. ప్రజల ఆగ్రహం తనను తాకిందని భావోద్వేగానికి లోనయ్యారు. తొలుత మీ అందరికీ క్షమాపణలు చెబుతున్నానని బ్రిటన్ ప్రజలను ఉద్దేశించి అన్నారు. ప్రధానిగా తన బాధ్యతలను ఏ లోటు లేకుండా నిర్వర్తించానని భావిస్తున్నానని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారాలని మీరు స్పష్టమైన సందేశం ఇచ్చారని, మీ తీర్పే అంతిమం అన్నారు. మీ ఆగ్రహాన్ని, అసంతృప్తిని నేను పూర్తిగా విన్నాను... ఈ ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. గడ్డు పరిస్థితుల తర్వాత ఇది కష్టమైన రోజు అన్నారు. దేశ ప్రధానిగా సేవలు అందించే అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. దేశంలోనే మనది అత్యుత్తమ దేశమన్నారు. ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ నేతలకు క్షమాపణలు**

తమ పార్టీలో చాలామంది ఈసారి సభ్యత్వాన్ని కోల్పోయారనీ, ఇది తనను చాలా బాధించిందని రిషి సునాక్ అన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ పార్టీ అధినాయకత్వ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. కొత్త నేతను ఎన్నుకునే ప్రక్రియ పూర్తయ్యే వరకు కొనసాగుతానన్నారు. నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్న లేబర్ పార్టీ నేత కీర్ స్మార్టర్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

## 11 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు



**పట్నా :** బిహార్‌లో రోజుల వ్యవధిలో వంతెనలు వరుసగా.. పేక మేడల్లా కుప్పకూలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో బిహార్‌లోని వంతెనల పరిస్థితిపై దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. మరోవైపు ఈ వంతెనల కూలిపోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వంపై స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అదీకాక రెండు వారాల్లో 12 వంతెనలు కూలిపోవడంతో ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ విషయాన్ని గమనించిన నితీష్ ప్రభుత్వం ఆగమేఘాల మీద చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఈ వంతెనలు కూలిపోతున్న ఘటనల్లో మొత్తం 11 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు నితీష్ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే కులిపోయిన వాటి స్థానంలో కొత్త వంతెనలు పునర్ నిర్మించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. మరోవైపు ఈ వంతెనలు కూలిపోతున్న ఘటనలపై ఆ రాష్ట్ర జలవనరుల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి చైతన్య ప్రసాద్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ వంతెన ప్రమాదాలల్లో కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో ఈ ఇంజినీర్లు విఫలమవ్వడమే కాకుండా.. ఇతరత్ర కారణాలు సైతం ఉన్నాయన్నారు. అలాగే ఈ వంతెనలు నిర్మించిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేవలం 17 రోజుల్లో 12 వంతెనలు కూలిపోయాయన్నారు. ఇక గ్రామీణ పనుల విభాగం కార్యదర్శి దీపక్ సింగ్ మాట్లాడుతూ.. జూన్ 18న అరారియా జిల్లాలోని బాక్రా నదిపై నిర్మించిన వంతెన దెబ్బతిన్నట్లు తమకు నివేదిక అందిందన్నారు. ఈ వంతెనలు కూలిపోయిన ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరుపుతున్నాయని వివరించారు. మరోవైపు బిహార్‌లోని మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లో వరుసగా వంతెనలు కూలిపోయాయి. అయితే ఈ ప్రమాదాల్లో ఎక్కడ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.

## ఎంపీలుగా ప్రమాణం చేసిన.. రషీద్, అమృత్ పాల్



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో కాశ్మీరి నేత ఇంజినీర్ రషీద్, ఖలిస్థాన్ అనుకూల నాయకుడు అమృత్‌పాల్ సింగ్ సభ్యులుగా ప్రమాణం చేశారు. శుక్రవారం పార్లమెంట్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య వీరిద్దరు ఎంపీలుగా ప్రమాణం చేశారు. ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నాడనే ఆరోపణలపై ఇంజినీర్ రషీద్‌ను గతంలో ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. దీంతో ఆయన ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. అలాగే నిషేధిత వారిస్ పంజాబ్ దే అధినేత అమృతపాల్. గతంలో జాతీయ భద్రత చట్టం కింద అరెస్టయ్యారు. దాంతో తన అనుచరులతో ఆయన అసోంలోని డిబ్రూఘర్ జైల్లో ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వీరిద్దరు విజయం సాధించారు. జమ్ము కాశ్మీర్‌లోని బారాముల్లా నుంచి రషీద్ స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచారు. తన ప్రత్యర్థి నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాపై 2 లక్షల ఆధిక్యంతో రషీద్ గెలుపొందారు. అలాగే పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా అమృత్ పాల్ సింగ్ పోటీ చేసి గెలిచారు. మరోవైపు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన లోక్‌సభ సభ్యులు.. జూన్ 24, 25 తేదీల్లో ప్రమాణం చేశారు. దీంతో తాను ఎంపీగా ప్రమాణం చేయ్యాలని.. అందుకు అనుమతించాలని రషీద్.. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ క్రమంలో ఎంపీగా ఆయన ప్రమాణంపై ఏమైనా అభ్యంతరాలుంటే జులై 1వ తేదీ లోపు తెలియజేయాలని ఎన్ఐఏను ఆదేశించింది. అయితే అందులో ఎటువంటి అభ్యంతరం లేదని డిల్లీ హైకోర్టుకు ఎన్ఐఏ స్పష్టం చేసింది. దీంతో జులై 5వ తేదీ రషీద్ ఎంపీగా ప్రమాణం చేసేందుకు హైకోర్టు రెండు గంటల పేరోల్‌కు అనుమతి ఇచ్చింది. అలాగే అసోంలోని డిబ్రూఘర్ జైల్లోనున్న అమృత పాల్ సింగ్ పేరోల్‌పై నాలుగు రోజులు బయటకు వచ్చారు. దీంతో వీరిద్దరు ఎంపీలుగా ప్రమాణం చేశారు.

# ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు మరోసారి తీవ్ర నిరాశ

ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆమె జుడీషియల్ కస్టడీని జులై 18 వరకు రౌస్ అవెన్యూ కోర్ట్ పొడగించింది. నేటితో కవిత జ్యూడిషల్ కస్టడీ ముగియడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను రౌస్ అవెన్యూ కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. కాగా ఏప్రిల్ 11న ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె తీహార్ జైలులో ఉన్నారు.

కాగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవి ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తీహార్ జైలులో ప్రశ్నించిన అనంతరం సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కవిత అరెస్ట్‌ను అధికారికంగా సీబీఐ ప్రకటించి, కోర్టుకు కూడా సమాచారం ఇచ్చింది. దీంతో ఈడీ కస్టడీలో ఉన్న సమయంలోనే కవిత మరోసారి అరెస్టయినట్టయింది. అటు ఈడీ.. ఇటు సీబీఐ అరెస్ట్ నేపథ్యంలో కవిత చాలా కాలంగా



జైలులోనే ఉన్నారు. బెయిల్ కోసం ఆమె చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె దాఖలు చేసిన పిటిషన్లు తిరస్కరణకు గురవుతున్నాయి.

మద్యం పాలసీ కేసులో కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. ఈ కేసులో కవితను సీబీఐ ఏప్రిల్ 11న అరెస్ట్ చేసింది. అంతకుముందే, ఈడీ ఆమెను అరెస్ట్ చేసింది. తీహార్ జైల్లో ఉన్న కవితను ప్రశ్నించిన సీబీఐ, ఆ తర్వాత అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈడీతో పాటు సీబీఐ కేసులలో కవిత చాలాకాలంగా జైల్లో ఉన్నారు. ఆమె బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టులో తిరస్కరణకు గురవుతున్నాయి. కాగా కవితకు బెయిల్ దక్కకపోవడంపై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర నిరాశకు గరవుతున్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో క్రియాశీలక నాయకురాలైన కవిత జైలులో ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక కీలక నేతల జంపింగ్‌లతో బీఆర్ఎస్ సతమతమవుతున్న విషయం తెలిసిందే. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు ఇప్పటికే అధికార కాంగ్రెస్ గూటికి చేరారు. మరో ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపు ఖాయమైనట్టు తెలుస్తోంది.

# నిరుద్యోగుల ఆందోళన..

**హైదరాబాద్:** టీజీపీఎస్సీ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయం ముట్టడికి నిరుద్యోగ జేఏసీ నేతలు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరగడంతో ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ నోటిఫికెషన్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

టీజీపీఎస్సీ శాంతియుత ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. ప్రధానంగా మూడు డిమాండ్లతో ముట్టడికి పిలుపునిచ్చింది. గ్రూప్ 2,3 పోస్టులు పెంచి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేసి, అక్టోబర్‌లో 25,000 పోస్టులతో మెగా డీఎస్సీ పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ 1లో 1:100ను అమలుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు. విద్యార్థులను ఎక్కడిక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇదేం పైత్యం.. టీజీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద రైతులను అరెస్టు చేసిన పోలీసులు..



నిరుద్యోగులు టీజీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో టీజీఎస్‌పీఎస్సీ కార్యాలయంతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న సాధారణ వ్యక్తులను కూడా పోలీసులు వదలి పెట్టడం లేదు. ఓ రైతు లుంగీ కట్టుకోని మరో ఇద్దరితో కలిసి నాంపల్లి ఏరియాలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. పోలీసులు ఆ రైతుతో పాటు మరో ఇద్దరిని అడ్డుకున్నారు. బలవంతంగా పోలీసు వాహనం ఎక్కించే ప్రయత్నం చేశారు. తాను తన కొడుకు కాలేజీ కోసం వచ్చానని సదరు రైతు చెప్పినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. ధర్నాకు రాలేదని మొత్తుకుంటుంటే.. మరి ఎక్కడికి వచ్చావంటూ రైతును ప్రశ్నిస్తూ పోలీసులు ఓవరాక్షన్ చేశారు. అమాంతం ఆయనను పోలీసు వాహనంలోకి ఎక్కించారు. పోలీసుల తీరుపై సదరు రైతు మండిపడ్డారు. మమ్మల్ని ఎందుకు అరెస్టు చేస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అనంతరం రైతుతో పాటు మరో ఇద్దరిని గోషామహల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఓ లాయర్ పట్ల కూడా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మరి అతని బైక్ ఆపి పోలీసు వాహనంలో ఎక్కించారు. పోలీసు లాయర్ గల్లా పట్టుకోవడంతో ఆయన ఊగిపోయారు. ఇదేనా పోలీసులు ప్రవర్తించే తీరు అని మండిపడ్డారు. ధర్నాతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా పోలీసులు అరెస్టు చేస్తున్నారని ఆ లాయర్ వాపోయారు. మరో ఇద్దరు యువకులను కూడా అకారణంగా అరెస్టు చేశారు.

**హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్: హరీష్ రావు**

కాగా నిరుద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా, డిమాండ్ల సాధనే లక్ష్యంగా టీజీపీఎస్సీ వద్ద శాంతియుత నిరసన తెలియజేసేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. సోకాల్డ్ ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. తమ గోసను రిప్రజెంటేషన్ ద్వారా చెప్పుకునే అవకాశం కూడా లేదా అని నిలదీశారు. ఒక వైపు ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ... నిరుద్యోగుల గొంతులను, హక్కులను అణగదొక్కే కుట్రలకు రేవంత్ సర్కారు పాల్పడుతరోందని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ ప్రజాపాలన కాదని 'అప్రజాస్వామ్యపాలన' అని ఉద్యోగాల కోసం పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని హరీష్ రావు విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం తిప్పుకుంటే విద్యార్థులకు నిరుద్యోగులకు తోడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు.. డిమాండ్లు సాధించే దాకా.. వదిలిపెట్టమన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున గొంతెత్తుతామని, నిర్విరామ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేయాలని, నిర్బంధించిన వారిని, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు అన్నారు.

# మారని ఉద్యోగుల తీరు...

**హైదరాబాద్ :** తెలంగాణలో పాలనపై రేవంత్ రెడ్డి సర్కార్ తనదైన మార్క్ చూపించాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని వివిధ శాఖల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంత్రులంతా ఆయా శాఖల కార్యాల యాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అయితే మంత్రులు ఆకస్మికంగా తనిఖీలు చేసి ఉద్యోగులకు సర్‌ప్రైజ్ ఇవ్వాలని చూస్తే ఉద్యోగులే మంత్రులకు షాకులు ఇస్తున్నారు. ఆఫీసులకు వెళ్లిన మంత్రులకు ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయి. అందులో ఉండాల్సిన ఉద్యోగులు మాత్రం తర్వాత తాపీగా వస్తుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు సమయానికి రారనే ప్రచారంతో అసలు అధికారులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర మంత్రులు వరుసగా తనిఖీలు చేస్తూ వారిలో జవాబుదారీతనాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రిని చూసి ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నిర్దేశిత సమయానికి కొంత మంది మాత్రమే ఉద్యోగులు హాజరవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎంత మంది ఉద్యోగులు హాజరయ్యారంటూ అటెండెన్స్ బుక్ చూడాలంటూ సూచించారు. మీకు టైమ్



టేబుల్ ఉండదా..? లేట్‌గా వస్తే అడిగేవారు లేరా..? అని ప్రశ్నించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అసలు డ్యూటీకి హాజరవుతున్నారా..? వారి పనితీరు ఎలా ఉంది అనే దానిపై వరుస తనిఖీలు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఉద్యోగులు టైమ్‌కి రాకపోయినా, పని తీరు సరిగ్గా లేకపోయినా నివేదికలు అడుగుతున్నారు. కొన్నిసార్లు అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు నిర్లక్ష్యం వహించే ఉద్యోగులకు భయం పుట్టేలా ఈ తనిఖీలు జరుగుతున్నాయని తెలిసింది. ఇక నుంచి తప్పకుండా అందరూ ఉద్యోగులు సమయానికి విధి నిర్వహణకు హాజరవ్వాలని ఆదేశించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చించారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది విధులకు నిర్దేశిత సమయానికి హాజకాకపోవడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. కాగా, బుధవారం ఆర్ అండ్ బీ సెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిం దే. ఆర్ అండ్ బీ విభాగంలో ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడంతో షాక్ తిన్నారు. ఇక తుమ్మలకు ఇలాంటి వాతావరణం కనిపించడంతో అధికారులపై సీరియస్ అయ్యారు.

## విభజన అంశాలు ఇప్పటికైనా కొలిక్కి వచ్చేనా?

-మొదటిపేజీ తరువాయి

చర్చించే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్తు సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య బకాయిలపై చర్చించే అవకాశముంది. దాదాపు రూ.24 వేల కోట్లు ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెల్లించాల్సి ఉంది. కానీ.. రూ.7 వేల కోట్లు తెలంగాణ తమకు చెల్లించాల్సి ఉందని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోంది. విభజనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మార్చి నెలలో సీఎం చొరవతో ఢిల్లీలో ఏపీ భవన్‌కు సంబంధించిన విభజన వివాదం పరిష్కారమైన విషయం తెలిసిందే. ఇటీవలే మైనింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల పంపిణీకి పడిన చిక్కుముడి కూడా వీడిపోయింది. ఇప్పటి వరకు విభజన వివాదాలపై రెండు రాష్ట్రాల అధికారుల మధ్య దాదాపు 30 సమావేశాలు జరిగాయి. షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థలు ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర హోం శాఖ షీలాబీడే కమిటీని వేసింది. వీటిలో 68 సంస్థలకు సంబంధించిన పంపిణీకి అభ్యంతరాలేమీ లేవని స్పష్టం చేసింది. మిగతా 23 సంస్థల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. పదో షెడ్యూలులో ఉన్న 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ వంటి 30 సంస్థల పంపిణీపై ఇంకా వివాదాలున్నాయి. వీటితో పాటు పలు అంశాల మీద సీఎంలు చర్చించే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ భేటీలో రెండు రాష్ట్రాల సీఎంలతో పాటు.. ఇంకా ఎవరెవరు పాల్గొంటారు.. అజెండా ఏంటి అనేదానిపై మాత్రం మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## మీ సేవలో అంతా దోపిడీయే

-మొదటిపేజీ తరువాయి

పథకాలకు అడ్డదారిలో సర్టిఫికేట్లు మంజూరు చేయడమే వీరి ప్రత్యేకత. కొంతమంది నిందితులు ఓ గ్యాంగ్ గా ఏర్పడి హైదరాబాద్ లోని పలు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేయిస్తూ అక్రమార్జనలకు పాల్పడుతున్నారు. అర్జీదారులు లేకుండానే సర్టిఫికెట్లు విడుదల చేయడం..సంబంధిత సర్టిఫికెట్లను సీక్రెట్ గా ఇంటికే పంపించడం వంటి వ్యవహారాలు చేస్తున్నారు. ఇందుకు గాను దరఖాస్తుదారులనుంచి అడ్డగోలుగా దండుకున్నారు. సదరు ఈ గ్యాంగ్ కొంత మంది బ్రోకర్లను మీ సేవా సెంటర్ల వద్ద కాపుగాయించి సర్టిఫికెట్లు కావలసిన వారికి ఒక్కో దానికి ఇంత చొప్పున వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్ వాల్యూను బట్టి రూ.50 వేల నుంచి 5 లక్షల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసంది. అయితే ఈ వ్యవహారం అంతా వీఆర్ఏ, డీటీ, ఆర్ ఐ వంటి అధికారుల ప్రమేయం లేకుండానే గుట్టచప్పుడు కాకుండా నడిపిస్తున్నారు. రెండేళ్లుగా ఈ వ్యవహారాన్ని ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడు. ఇప్పటిదాకా వెయ్యికి పైగా సర్టిఫికెట్లు జారీ చేసి భారీగా సొమ్ములు అందిపుచ్చుకున్నట్లు తెలిసింది. ఇక తహశీల్దార్ కు సంబంధించి డిజిటల్ కీ సంతకంతో వందల సంఖ్యలో అనునిత్యం సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తూ అందినకాడికి సొమ్ము చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మైనార్టీ కార్యాలయం నుంచి మండల కార్యాలయానికి ఈ అక్రమాలపై ఆకాశ రామన్న ఉత్తరం రావడంతో స్వయంగా అధికారులు రంగంలోకి దిగారు. భారీ స్కామ్ నిజమేనని గుర్తించారు. దీనితో నిందితుల గుట్టు రట్టయింది. తీగలాగితే డొంక కదిలిన చందంగా రెండేళ్లుగా అడ్డూ అదుపూ లేకుండా నిందితులు జరిపిన స్కామ్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. అయితే ఈ నిందితుల వద్దకు వచ్చిన వారంతా ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడం గమనార్హం. మీ సేవా కేంద్రాలలో కుప్పలుగా అప్లికేషన్లు పడివుండటంతో పరిశీలనకు వచ్చిన ఎమ్మార్వో కార్యాలయ అధికారులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. తమ ప్రమేయం లేకుండానే ఇవన్నీ జరుగుతున్నాయా అని ఉలిక్కిపడ్డ అధికారులు జరిగిన భారీ స్కామ్ పై మంచాల పరిధిలోని పోలీస్ స్టేషన్లో రంగారెడ్డి ఎమ్మార్వో ఫిర్యాదు చేశారు. ఈ భారీ స్కామ్ కు పాల్పడ్డ కంప్యూటర్ ఆపరేటర్ ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సాయంతో ఈ అక్రమాలకు పాల్పడ్డాడని తేలడంతో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిద్దరిపై 420, 409 సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు పోలీసులు. కాగా వీరి వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారో? వారి పాత్ర ఏమిటో కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఈ విషయం బయటకు తెలిస్తే తమ ఉద్యోగాలు ఎక్కడ పోతాయో అని భయపడుతున్నట్లు తెలుస్తోంది. రంగారెడ్డి ఎమ్మార్వో పరిధిలోని మీ సేవలో జరిగిన అక్రమాలు మాదిరిగా రాష్ట్రంలో ఇంకా ఎక్కడెక్కడ మీ సేవా సెంటర్లలో ఇలాంటివి జరుగుతున్నాయో అని ఎంక్వైరీ చేస్తున్నారు. లోతుగా వెళితే మరిన్ని మీ సేవ అక్రమాలు బయటకొచ్చే అవకాశం ఉంది.

## హైకమాండ్ దగ్గర పలుకుబడి తగ్గిందా



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం, ఆధిపత్య పోరు కనిపించకుండా భారీగా ఉందని కేబినెట్ విస్తరణ ఆగిపోవడం.. పీసీసీ చీఫ్ పదవి పై ఓ అంచనాకు రాలేకపోవడం వల్ల అర్థం చేసుకోవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అనుకున్నారు. ప్రాంతాలు, వర్గాలు సమీకరణాల్ని రెడీ చేసుకుని ఐదుగురి పేర్లతో హైకమాండ్ వద్దకు వెళ్లారు. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచారని అనుకున్నారు. అయితే రేవంత్ కు పోటీగా మరో ఇద్దరు సీనియర్ మంత్రులు.. కేబినెట్‌లో ఫలానా వాళ్లకు చోటు కల్పించాలం టూ.. చెరో జాబితా సమర్పించారని తెలుస్తోంది. దీంతో హైకమాండ్ అన్ని పేర్లను పక్కన పెట్టింది. ఏకాభిప్రాయం వస్తుందేమోనని హైకమాండ్ చర్చలు జరిపినప్పటికీ రాకపోవడంతో పక్కన పెట్టేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆశావహులతో గట్టిగా పని చేయించడానికి వాటిని తాయిలాలుగా చూపించాలని ఆరు ఖాళీలు ఉంచారు. కానీ ఇప్పుడా పధవుల భర్తి అంత తేలికగా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ఒక్క రేవంత్ చాయిస్సే కాదు. హైకమాండ్ అనుమతి కూడా ఉండాలి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మొత్తం ఆరు స్థానాల్లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్క మల్ రెడ్డి మాత్రమే గెలిచారు. తనకు చాన్సివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. ఎంపీగా ఓడిపోతే మంత్రి పదవి ఆఫర్ తో దానం నాగేందర్ పార్టీలో చేరారు. మరో వైపు దామోదర రాజనర్సింహ.. రెండు పేర్లు ప్రకటించేశారు. సీతక్కకు డిప్యూటీ సీఎం ఇస్తారని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ లో అలజడి రేగింది. ఇక నామినేటెడ్ పోస్టుల వ్యవహారం తేలడం లేదు. ఎన్నికలకు ముందు కొంత మందికి నామినేటెడ్ పోస్టులు ప్రకటించారు. ఇప్పటికీ జీవో రిలీజ్ చేయలేదు. వాటికే అధికారిక హోదా ఇవ్వకపోతే కొత్తవి ఎప్పుడు భర్తీ చేస్తారోనని కాంగ్రెస్ క్యాడర్ టెన్షన్ పడుతోంది. అధికారంలోకి వచ్చి నెలలు గడిచిపోతున్నాయి కానీ.. కష్టపడిన దానికి ఫలం మాత్రం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు ఫీలవుతున్నారు. పీసీసీ చీఫ్ పోస్టుతో పాటు మంత్రి పదవుల భర్తీని కూడా కొంతకాలం ఆపాలని హైకమాండ్ నిర్ణయంచడంతో రేవంత్ రెడ్డి ఇక పాలనపై దృష్టి పెట్టనున్నారు. ఈ నెలలో ఆయన పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టాల్సి ఉంది. అందులో రుణమాఫీకి నిధులతో పాటు అనేక పథకాలు అమలు చేస్తామని నమ్మకం కలిగించే విధంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ముందు ఈ గండాన్ని గట్టెక్కాలని పాలనను దారిలో పెట్టుకోవాలని హైకమాండ్ సూచనలను పాటించేందుకు రేవంత్ రెడీ అయ్యారు. అంతిమంగా రేవంత్ రెడ్డి అనుకున్న విధంగా కాంగ్రెస్ పార్టీపై పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకపోయారని అందుకే.. ఆయన జాబితాలను కాంగ్రెస్ పక్కన పెట్టి సీనియర్ నేతల మాటలకు విలువ ఇస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామం సీనియర్లకు మరింత ఉత్సాహం ఇస్తోందని అనుకోవచ్చు.

